# ఆత్మనాదం

అది నెల్లూర్లో బాగా పేరుపడ్డ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్.

రెండో అంతస్తు, మొదటి గదిలో నుంచి సుమారు పాతిక సంవత్సరాల వయస్సుగల యువతి కిటికీ వద్ద నిలుచుని, రోడ్డు మీదికి దృష్టి సారించి, హాస్పిటల్‌కి వచ్చే కార్ల వేపు ఎక్స్‌పెక్టేషన్‌తో కళ్ళతో చూస్తూంది. అప్పుడప్పుడూ సెనుగ్గా రిస్టు వాచీని చూసుకుంటూ భారంగా నిట్టూర్పులు విడుస్తూంది, దిరాగ్గా ముఖం పెట్టి.

లైట్ బ్లూ కలర్ ఫారిన్ నైలెక్స్ చీర, అదే రంగు జాకెట్ ధరించిన ఆ యువతి మేలిమి రంగు శరీరం వింత కాంతిని సంతరించుకుని మెరిసిపోతూంది. సాను గాలికి వెంట్రుకలు ముఖంమీద పడుతూ, గుండ్రని ఆమె ముఖానికి కొత్త అందాలు తెచ్చి పెడుతున్నాయి.

ఉన్నట్టుండి ఆమె కళ్ళు మెరిసేయి.

హాస్పిటల్ గేట్లోంచి ఓ కారు ముందుకు దూసుకొచ్చి, హాస్పిటల్ ప్రాంగణంలో ఆగింది. అందులోంచి తెల్లని కోటుతో ఉన్న డాక్టర్లూ, బ్లాక్ కలర్ ఫుల్ సూటులో ఉన్న మరో యువకుడూ దిగేరు.

ఆ యువతి నిలుచున్న కిటికీవేపు చూపిస్తూ డాక్టరు ఏవో చెప్పేడా బ్లూ సూట్ యువకుడికి. హుషారుగా తల పంకించి, పరుగులాంటి నడకతో ముందుకు దూసుకొస్తున్న యువకుణ్ణి చూసి ఆ యువతి ముఖం ఎరుపెక్కింది సిగ్గుతో. కళ్ళలో అవ్యక్తమైన ఆనందం గోచరించింది.

"హల్లో ... లతా!" గదిలోకి అడుగు పెడుతూనే ఆనందంగా చేతులు చాచేడు. మరుక్షణంలో అతని కౌగిట్లో ఇమిడి పోయింది. ఆమె తలను నిమురుతూ, చాలాసేపటివరకూ మౌనంగా ఉండి పోయేరు డాక్టర్ సుధాకర్.

"ఏమిటి లతా ... ఏడుస్తున్నావా?" అంటూ ఆమె చిబుకాన్ని పట్టుకుని తల పైకెత్తి ఆమె కళ్ళలోకి చూసి, "నే వచ్చేసేగా" అన్నాడు ఓదారుస్తున్న ధోరణిలో.

ఎన్నో విషయాలు మాట్లాడాలని అప్పటివరకూ కలలు కంటున్న లతకు మాటలు రావడం లేదు. మాటలకంటే ముందు దుఃఖం పెల్లుబికి వస్తూంది.

"ఛీ ... ఏమిటి చిన్నపిల్లలా! రా ... ఇలా కూర్చుందాం." హాండ్ కర్చీఫ్‌తో ఆమె కన్నీటిని తుడుస్తూ అని, సోఫాలో కూర్చున్నాడు. లత కూడా కూర్చుంది అతని పక్కనే.

"మూడు సంవత్సరాలయింది మిమ్మల్ని చూసి." వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ అంది, అతన్ని తనివితీరా చూస్తూ.

బదులుగా నవ్వి, "నువ్వు చాలా సేపయిందా వచ్చి, ట్రెయిన్ రెండు గంటలు లేటయింది. పాపం, కృష్ణ ఇక్కడ పేషెంట్లను వదిలేసి, నాకోసం స్టేషన్లో రెండు గంటలు వెయిట్ చేసేడు ... అమ్మగారు బాగున్నారా? ఆరోగ్యం మెలా ఉంది?" అని అడిగేడు.

"బాగుంది. మిమ్మల్ని ఇంటికి తీసుకు రమ్మని చెప్పింది."

"అక్కడికా!?"

"మీరింకా పాత సంగతులు మరిచిపో లేదా?" ఆమె గొంతులో బాధ స్పష్టంగా ధ్వనించింది.

"మాటల్ని మరిచిపోవడం సులభం కాదు, లతా ... అయినా, నాకేమీ బాధ కలగడం లేదులే" అన్నాడు నవ్వుతూ.

అయినా అతని మనస్సులో బాధ కొట్టుకులాడుతూనే ఉందని అనుకుంది.

"మరి మీ అన్నయ్య విషయం చెప్పలేదు" అన్నాడు మాట మారుస్తూ.

"కడుపులో అల్సరుందని తెలిసిన తరవాత ఎంతో మారిపోయేడు. మును పటి ఉత్సాహం చాలావరకు తగ్గింది. ముభావంగా ఉంటున్నాడు. అమ్మగానీ, నేనుగానీ మాట్లాడిస్తేనే, జీవితంమీద విరక్తితో ఉన్నట్టు మాట్లాడుతున్నాడు. అన్నయ్య వాలకం చూస్తూ, ఏమీ చెయ్యలేక అమ్మ కృశించిపోతోంది."

"ఊఁ!"

"మొన్న కృష్ణన్నయ్య వచ్చి మీ విషయం చెప్పి, మీరు బాగుచేసిన కేసుల వివరాల్ని చెబుతోంటే అన్నయ్యముఖంలో ఉత్సాహం, కాంతి కనిపించేయి. అయితే, ఎందుకో ఆ తరవాత ముఖం మ్లాడ్చు కున్నాడు. ఆపరేషన్ చేయించుకోవడం తన కిష్టంలేదని చెప్పేడు."

"మరి?!"

"అమ్మ బలవంతం మీద గాని ఒప్పుకోలేదు."

"అయితే మీ అన్నయ్యతో ఇంకా మార్పు రాలేదన్న మాట?"

"అలా అని ఎందు కనుకోవాలి?"

మెల్లగా నవ్వి, ఆమె చేతిని తన చేతి లోనికి తీసుకుని ఏదో చెప్పబోయేంతలో గుమ్మం వద్ద దగ్గు వినిపించి కంగారుగా లత చేతిని వదిలేసేడు. ఇద్దరూ తిరిగి చూసేరు వాకిలి వేపు. "మే ఐ కమిన్?" అంటూ నవ్వుతూ లోపలికి వచ్చేరు డాక్టర్ కృష్ణ — 'వీళ్ళ ఆనందాన్ని చెడగొట్టేనేమో' అని తనను తాను నిందించుకుంటూ. బదులుగా ఇద్దరూ నవ్వేరు.

"అబ్బ ... ఎన్ని సంవత్సరాలయిందీ రూమ్‌లో మిమ్మల్నిద్దర్నీ చూసి! ఇప్పుడు నా కెంతో సంతోషంగా ఉందమ్మాయ్" అన్నాడు లత వేపు చూస్తూ వాళ్ళ కెదురుగా ఉన్న మరో సోఫాలో కూర్చుంటూ.

"అన్నయ్యకు ఆపరేషన్ ఎప్పుడు చేస్తా రన్నయ్యా?" కొన్ని క్షణాలు ఆవరించిన నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ అడిగింది లత కృష్ణను. "నా దేముం టమ్మా ... ఈ స్పెషలిస్టు గారి దయ, మన ప్రాప్తం. మద్రాసులో ఈయన గారికి డిమాండు పెరిగింది. నేనే వండ రయిపోయేననుకో. వీడి క్రింద ఎంత మంది అసిస్టెంటు డాక్టర్లూ, నర్సులూ, రోగులూ!"

"ఏమిటి, రోగుల్ని కూడా చేర్చేవు లిస్టులో!" ఆ మధ్యలో కలగజేసుకుని పెద్దగా నవ్వుతూ అన్నాడు సుధాకర్. అతని నవ్వుతో వాళ్ళిద్దరుకూడా శ్రుతి కలిపేరు. గది కళకళలాడింది.

"అవతల పేషెంట్లున్నారు. మరి నేను వస్తాను" అంటూ లేచి వెళ్ళి పోయేడు డాక్టర్ కృష్ణ — చాలాకాలం తరవాత కలుసుకున్న ప్రేమికుల మధ్య పానకంలో పుడకలాగా ఉండడం ఇష్టం లేక.

"బ్రతికించేడు" అన్నాడు సుధాకర్ ఆమెకు మరింత దగ్గరగా జరుగుతూ.

"మీ కొంటెతనం ఇంకా పోలేదు" అంది లత హాయిగా నవ్వుతూ. "మరి

"మొన్న కృష్ణ వచ్చినంతవరకు వాడికి కూడా తెలియదు ... అసలు నేను మళ్ళీ ఈ ఊరు చూస్తాననుకోలేదు, లతా ... ఆ నాడు ..."

● ● ●

"అమ్మా ... అమ్మా ..." అప్పుడే ఇంట్లోకి అడుగు పెట్టిన సుధాకర్‌ను చూసి, చేతిలోని మాగజైన్‌ను పక్కన పడేసి, తల్లికోసం కేకలు పెట్టింది లత.

"నీ కీ మధ్య గొంతు పెద్దదౌతోంది!" కొంటెగా నవ్వుతూ అని, ఆమె కెదు రుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు సుధాకర్.

"మీకుమాత్రం కాలే దేమిటి?" అంది కోపాన్ని అభినయిస్తూ లత.

"ఉన్న కోపమంతా ఇప్పుడే పోగొట్టుకోకు. రేపు పెళ్ళయిన తరవాత స్టాకు లేకపోతే బాధపడాల్సి వస్తుంది" అన్నాడు.

"నా కా బాధ లేదులే ... మీరు వైద్యం చేస్తే తిరిగొస్తుంది."

"ఉహూఁ! నా మీద చాలా నమ్మక ముందే!", అన్నాడు నవ్వుతూ. ఇంతలో శారదాంబగారు హాల్లోకి వస్తూ, "ఏం బాబూ, ఈ మధ్య మరీ నల్లపూస అయి పోయావేమి?" అనడిగింది సుధాకర్‌ను.

"లేదండీ ... ఏదో పని ఒత్తిడివల్ల ..." అన్నాడు వినయంగా, ఆమె రాకతో

పెళ్ళి కానీయ్" అన్నాడు, ఆమె బుగ్గ మీద చిటికేస్తూ.

"మీరు ఏమయ్యారోనని బెంగతో ఓ వేపు నేనుంటే, మరో వేపు మా అన్నయ్య సంబంధాలు తీసుకురావడం మొదలుపెట్టేడు. నే నెంత ఒప్పుకోకపోయినా అన్నిటినీ తిరగ్గొట్టేనో, అన్నయ్యంత పట్టుదలతో తీసుకొచ్చేవాడు. కొంత కాలం తరవాత అమ్మకూడా బలవంతం చేసింది కానీ, నా పట్టుదల ముందు ఆమె బలవంతం పనికిరాలేదు. క్రమంగా ఇద్దరిలోనూ ఉత్సాహం తగ్గింది."

"బాగుంది ... మరి అసలు వరుడు మద్రాసులో ఉంటే నీకు పెళ్ళెట్లా గవుతుంది?"

"మీరు మద్రాసులో ఉన్నారని తెలిస్తే ..." అని ఏదో చెప్పబోయేం తలో, మధ్యలో కలగజేసుకుని అన్నాడు సుధాకర్.

గౌరవసూచకంగా లేచి కూర్చుంటూ. శారదాంబ వచ్చి కూతురు పక్కనే కూర్చుంది.


"మోహన్ లేడండి?" తను అడిగే వ్యక్తి ఇంట్లో లేడని తెలిసినా, మర్యాద కోసం ఏదో ఒకటి మాట్లాడాలి కనక అడిగేడు. "ఈ పాటికి వచ్చేయాలి, బాబూ" అంది శారదాంబ. ఆమెకు తెలుసు, సుధాకర్ ఆ రోజు ఎందు కొచ్చేడో. ఆ విషయం తల్లితో ముందు గానే చెప్పింది లత. ఆ శుభ సమయం కోసమే తనూ ఎదురుచూస్తూంది. ఇక కొడుకు ఒప్పుకోవడం మిగిలి ఉంది.

సుధాకర్ ఆ ఊర్లోనే డాక్టర్‌గా పనిచేస్తున్నాడు గవర్నమెంటుహాస్పిటల్లో. వెనకా ముందూ ఎవరూ లేరు. చిన్న ప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని, మేన మామల దయాదాక్షిణ్యాలతో స్వయం కృషిని జోడించి, ప్రభుత్వ సహాయాన్ని

ఉండటానికి డాక్టర్ అయి సంపాదించి తన జీవితానికి సార్థకతను కలిగించు కున్నాడు.

ఇయస్ఫ్లు క్లాసులో పరిచయమయ్యారు శారదాంబ కొడుకు మోహన్, సుధాకర్లు. పరిచయం గాఢస్నేహంగా మారకపోయినా, అప్పుడప్పుడూ తన ఇంటికి ఆహ్వానించేవాడు మోహన్ సుధాకర్ని. ఆ రోజుల్లో అతన్ని ఆదరించిన కుటుంబాల్లో, శారదాంబ కుటుంబం ఒకటి.

డాక్టర్ సుధాకర్ని తరుచూ తన అన్నయ్య ఆహ్వానించి ఇంటికి తీసుకు రావడం మొదట్లో ఇష్టం ఉండేదికాదు లతకు. ఆ మాటే నాలుగైదుసార్లు తల్లితోనూ, అన్నయ్యతోనూ అంది. "అతను చాలా మంచివాడే కావచ్చు మమ్మీ. మనందరిలాంటి వాడు కాదు" అంటూ ఓ సర్టిఫికేట్ ఇచ్చేసి వచ్చేది. శారదాంబకు సుధాకరంటే మంచి అభిప్రాయంతోబాటు, ఆదరాభిమానాలు కలిగేందుకు కేవలం అతనిది తన కులం



మాలకొండయ్య టి.

కావడమే గొప్ప కారణం. క్రమంగా సుధాకర్ ఆ ఇంటి మనిషిగా మెలిగే అర్హతను సంపాదించుకున్నాడు, ఒక్క లత విషయంలో తప్ప.

"నాకు నా అనే వాళ్ళు లేరమ్మా. నన్ను చూసిన నా తల్లితండ్రుల్ని నేను చూడలేకపోయేను. మేనమామ దయా దాక్షిణ్యాలు నన్ను స్కూలుఫైనలు వరకూ చదివించేయి. కొందరు ధర్మాత్ముల ధర్మాలు, గవర్నమెంటు సహాయం నన్ను డాక్టర్ని చేసేయి. నేను డాక్టరయ్యే సరికి, భార్యాబిడ్డల్ని పోగొట్టుకుని ఏకాకిగా బ్రతికే మా మామయ్య కూడా ఈ లోకాన్ని వదిలేసేడు" అంటున్న సుధాకర్ మాటల్లోని ఔన్నత్యం శారదాంబను కరిగించివేసేవి. అతనిమీద ఆదరణ, వాత్సల్యం ఎన్నో మెట్లు ఎక్కించేది.

ప్రతి ఆదివారం సుధాకర్ తమ ఇంట్లో భోజనం చేస్తే గాని ఒప్పుకునేది గాదు శారదాంబ. "ఆ హోటల్ తిండి తిని ఎలా ఉంటున్నావు, బాబూ ఇక్కడ మేం ముగ్గురమే కదా అంతంత కొంపలో — ఆ హోటల్ తిండి మానేసి భోజనానికి ఇక్కడికే రాకూడదూ?!" అనే శారదాంబను చూసి, ఆమెకు మనస్సులోనే జోహార్లు అర్పించుకునేవాడు.

"భోజనాలు కూడా ప్రారంభమైనట్టుందే" అంది లత తల్లితో ఓ సారి వ్యంగ్యంగా.

"ఆ అబ్బాయి తిండికి లేక పస్తున్నాట్టే?!" అని మందలించేది సున్నితంగా. 'వాట్, డాక్టర్ సాబ్, నా కంటే మా ఇంట్లో గొప్ప స్థానాన్నే సంపాదించుకున్నావే ... మా మదర్ నిన్ను కలవరిస్తుంటుంది" అంటూ నవ్వేవాడు మోహన్.

తనవేపు కన్నెత్తి కూడా చూడని సుధాకర్ మీద లత కెందుకు ద్వేషం

పుట్టుకొచ్చిందో ఎంత తల బ్రద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు లతకు.

సుధాకర్ పట్ల ద్వేషభావాన్ని పూర్తిగా వదులుకుంది లత, ఒకానొక సంఘటనతో.

ఉన్నట్టుండి టైఫాయిడ్ ఎటాక్ అయిందామెకు. నెల రోజులు బాధ పడింది జ్వరంతో. ఆ నెల రోజులూ కేవలం ఒక డాక్టరుగా కాక, ఒక పర్సెంటులా ఆమెకు సేవలు చేసేడు. ఆత్మీయుడులా చూసుకున్నాడు. ఆమె క్రమంగా కోలుకుంది. అప్పటివరకూ ఏ ఉద్దేశ్యమూ లేని వాళ్ళిద్దరి మనస్సుల్లో ఈ సంఘటనతో ఇద్దరి మనస్సుల్లో అనురాగం మొలకెత్తింది. కొంతకాలం గడిచిన తరవాత ఇద్దరూ సన్నిహితులయ్యేరు. మనస్సులు కలిసేయి. కలిసి ఏకమయ్యేయి. ఆ విషయం తెలిసి శారదాంబ మనస్సులో ఆశీర్వదించిందా జంటను. అదీగాక వాళ్ళను వేరుచేసే కారణం ఏమీ కనిపించలేదామెకు. తన్నూ లక్షల విలువచేసే ఆస్తిపాస్తులున్నాయి. సుధాకర్‌కు ఏమీ లేకపోయినా నరవా లేదు. కులంకూడా ఒకటే. 'లతకు తగిన జంట' అని అనుకుని మురిసిపోయేది.

తమ చనువుపట్ల శారదాంబకు వ్యతిరేక భావం లేదని గ్రహించగలిగారిద్దరూ, ఆమె మాటల్నిబట్టి. ఎటొచ్చి ఇక మోహన్ అనుమతి కావాలి. అతని అనుమతిని సంపాదించేందుకే ఆ రోజు వచ్చేడు సుధాకర్.

"ఏదో బాబూ, ఆ మూడుముళ్ళూ పడిపోతే నా కేమీ బాధ ఉండదు. ఇక వాడి పెళ్ళి విషయం వాడే చూసుకుంటాడు" అంది శారదాంబ, ఓ సారి లత వేపు చూసి. శారదాంబ చూడకుండా కన్ను గీటేడు కొంటెగా సుధాకర్. "అమ్మ చూస్తూంది." కళ్ళతోనే జవాబు చెప్పి, తల వంచుకుంది లత.

సాయంకాలం వరకూ మోహన్ రాక పోయేసరికి, మరునటి రోజు వస్తానని చెప్పి వెళ్ళిపోయేడు సుధాకర్.

మరునటి రోజు సాయంకాలం హాస్పిటల్‌నించి తిన్నగా శారదాంబ గారింటికి వెళదామని, తొందరగా బయల్దేరే ప్రయత్నంలో ఉండగా, మోహన్ వద్ద నుంచి ఫోన్ కాల్ వచ్చింది. "నిన్న నేను ఇంటి కొచ్చేను కాని ..." అంటూ చెప్పబోయేంతలో — "డాక్టర్ ..." అని మోహన్ గొంతు కఠినంగా పలికింది ఫోనులో. విస్తుపోయేడు సుధాకర్.

"నీ అదృష్టం బాగుండబట్టి నిన్న నేను ఇంటికి రాలేక పోయాను. లేకుంటే నీ రక్తం కళ్ళచూసే వాణ్ణి." ఫోనులో మోహన్ కంఠం కోపంతో వణికిపోయింది. ఊహించలేని ఈ హఠాత్పరిణామానికి కంగారుపడ్డాడు సుధాకర్. "అది కాదు..." అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో.

"షటప్ ... నీకూ, మా లతకూ సక్కూ, నాగలోకాని కున్నంత దూరం. పిచ్చి వేషాలు వేసేవంటే ప్రాణం తీస్తాను."

"మోహన్ ... అది కాదు."

"ఏమీ ట్రా కానిదీ ... రాస్కెల్..."

"మిస్టర్ మోహన్..." ఆవేశంతో వణికిపోయేడు సుధాకర్. మోహన్ మాటలకు ఇక నిగ్రహించుకోలేక "గివ్ రెస్పెక్ట్ అండ్ టేకిట్ ..." అన్నాడు కోపంగా.

"ఆల్ రైట్." మళ్ళీ వినిపించింది మోహన్ కంఠం. "నీలాంటి డాక్టర్లను కొన్ని వందల మందికి జీతభత్యాలిచ్చి పోషించే శక్తిగల ఫామిలీ మాది. నీ నెల జీతం నా సిగరెట్ల ఖర్చులకి చాలదు. ఆఫ్టరాల్ ఒక సామాన్యమైన డాక్టర్‌కి మా ఇంటికి అల్లుడు కాగలిగే అర్హత లేదు. బీ కేర్‌ఫుల్" అంటూ ఫోన్ పెట్టేసేడు. చేతిలోని రిసీవర్ని విసురుగా హుక్ మీద ఉంచి కోపంగా లేచేడు సుధాకర్.

ఉన్నట్టుండి మారిపోయిన పరిస్థితుల్ని గురించి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. "ఆఫ్టరాల్ ఒక డాక్టర్‌కు మా ఇంటికి అల్లుడు కాగలిగే అర్హత లేదు. బీ కేర్‌ఫుల్." మోహన్ మాటలు పదే పదే వినిపిస్తూ, గుండెల్ని పిండి చేస్తున్నాయి. ఆ మాటల్ని మింగి, నిగ్రహించుకోగల శక్తి లేకపోయిందతనికి. 'ఏం చేయలే న్నేను' అనుకున్నాడు బాధగా.

మరునటి రోజు లత వచ్చింది. జరిగిన విషయం తనకు తెలుసుననీ, అన్నయ్య తరఫున తనను క్షమించమనీ ప్రాధేయపడింది. ఏమనుకున్నా, తనకు స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయించుకోగల శక్తి ఉందని చెబుతూ, "మా అన్నయ్య మరీ అంత పట్టుదలగా ఉంటే, ధైర్యంగా మీతో వచ్చేస్తాను. నా జీవితాన్నీ, భవిష్యత్తునూ మలచుకోగల హక్కు నాకుంది" అని ఆవేశంలో అన్నయ్య అన్న మాటల్ని తిరిగి తిరిగి ఆలోచించి మీ మనస్సు పాడుచేసుకోకండి" అంది. లత మాటలతో కాస్త ఊరట కలిగింది సుధాకర్‌కు.

ఆ సాయంకాలం క్లబ్బు కెళ్ళాడు. అక్కడ మోహన్ కనుపించేసరికి, తల తిప్పుకుని, గార్డెన్‌లో కెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు, ఆలోచిస్తూ. ఇంతలో మోహన్ వచ్చి, "మా రి ఁ ఁ వది వెళ్ళాలి" అన్నాడు.

"అంటే?" మోహన్ మొహంలో కనిపిస్తున్న కళవళాన్ని ఎంటిస్తూ చూస్తూ అడిగేడు.

"అదంతే."

"లేకుంటే?"

"ఆ తరవాత బాధపడవలసి వస్తుంది."

"ఎవరు?"

"నువ్వేరా, రాస్కెల్ .." అంటూ ఉన్నట్టుండి మెరుపులా లేచి సుధాకర్ ముఖం మీద బలంగా కొట్టేడు. ఊహించకుండా తగిలిన దెబ్బకు తూలి కుర్చీతో సహా వెనకకు పడిపోయేడు. పడిన వాడి మీదకు దుమికి, అతన్ని లేవనివ్వకుండా, రెట్టించిన ఆవేశంతో రెండు చేతుల్తో సుధాకర్ గొంతు పట్టుకొని బిగించేడు. ఇంతలో ఎవరో వచ్చి కలగజేసుకుని విడిపించే రిద్దరినీ.


"దొంగచాటుగా కలుసుకుంటూ ప్రేమా చెల్లెల్ని..." ఆవేశంతో ఏదేదో పేలుతున్న మోహన్‌ను అవతలకు తీసుకుపోయేరు కొందరు. అచేతనంగా నిలబడిపోయేడు సుధాకర్. భయంకరమైన ఆలోచనలు చుట్టుముట్టేయి.

ఆ మరునటి రోజు హాస్పిటల్లో తల ఎత్తుకుని తిరగలేక పోయేడు. అప్పటికే ఆ విషయం ఎలా తెలిసిందో వార్డు బాయ్ మొదలుకుని పెద్ద డాక్టరువరకు ఈ విషయాన్ని ఏదో ఒక రూపంలో మాట్లాడుకోవడం, తన ముఖంలోకి అదోలా చూడ్డం గమనించిన సుధాకర్ మనస్సు బాధతో గిలగిల కొట్టుకుంది. సాటి డాక్టర్లను ఓదారే నెపంతో వ్యంగ్యంగా మాట్లాడుతూంటే, మానుతున్న గాయాన్ని రేపినట్టుగా బాధ పడ్డాడు.

ఆ రోజు మధ్యాహ్నం శారదాంబగారి నౌకరు వచ్చి ఓ ఉత్తరా న్నిచ్చి వెళ్ళేడు. అది లత వ్రాసిన లెటరు. "దయచేసి మీరు వెంటనే ఈ ఊరు వదిలి వెళ్ళి పొండి" అని ముక్తసరిగా వ్రాసింది.

● ● ●

"ఆ లెటరు చదివి అప్పట్లో విన్ను అపార్థం చేసుకున్నాను, లతా. అప్పటికే బాగా గాయపడ్డ నా మనస్సు ఆలోచించే శక్తిని కోల్పోయింది. జీవితం మీద విరక్తి పుట్టుకొచ్చింది. అయితే, మీ అన్నయ్య మీద పగ తీర్చుకోనిదే నిద్ర పోకూడదనే దృఢనిశ్చయం కలగడం వల్ల, నేను వెళుతున్నట్టు కృష్ణకి కూడా చెప్పకుండా మద్రాసు వెళ్ళిపోయేను" అన్నాడు సుధాకర్.



"ఆ రోజు అన్నయ్య వాలకం చూసి భయం వేసింది నాకు. నాతో ఏమీ అనలేదు గాని, అమ్మతో అన్నాట్ట — ఈ సారి అతను లతను కలుసుకుంటే ప్రాణం తీస్తానని. అమ్మ నాతో చెప్పింది. క్లబ్‌లో జరిగిన సంఘటన కూడా తెలిసింది. ఏమీ దిక్కు తోచక నీకా లెటర్ వ్రాసేను" అంది లత.


"మద్రాసులో నాతోబాటు చదివిన ఓ ఫ్రెండ్ ఉన్నాడు. వాడో పెద్ద నర్సింగ్ హోమ్‌లో డాక్టరుగా ఉంటున్నాడు. తన పలుకుబడి ఉపయోగించి, పెద్ద డాక్టర్‌తో మాట్లాడి అదే నర్సింగ్ హోంలో నాకూ ఉద్యోగమిప్పించేడు. ఆ నర్సింగ్‌హోమ్ పెద్ద డాక్టర్‌కు చాలా పేరు ప్రఖ్యాతులున్నాయి. కడుపులో ఎలాంటి అల్సరు నయినా ఆపరేషన్ చేసి బాగుచేయడంలో సిద్ధహస్తుడు. ఎందుకో నేనంటే ఆయన ఎంతో అభిమానం చూపించేవాడు. ఆయన పర్యవేక్షణలో, అహోరాత్రులు శ్రమించి, నేనూ అంతటి వాడిని కాకపోయినా, ఆయనలా చెయ్యడం నేర్చుకున్నాను. ఆయన తరవాత అల్సరు లాంటి వ్యాధులకు డాక్టర్‌గా నన్నే చెప్పుకునే వారు. దురదృష్టవశాత్తూ కొంతకాలం తరవాత ఆయన చనిపోయేరు. ఆ తరవాత నేనూ ఆ నర్సింగ్‌హోమ్‌ను వదిలేసి, నా ఫ్రెండ్ ప్రోద్బలంతో వాడూ, నేనూ కలిసి మరో నర్సింగ్‌హోమ్ ప్రారంభించేము. ప్రారంభించిన వేళావిశేషమేమో, తీసుకున్న ప్రతి కేసూ సక్సెస్ కావడమూ, పేరుతోబాటు డబ్బు కూడా రావడమూ జరిగింది. ఆ నాడు మీ అన్నయ్య అన్నాడు — నా జీతం అతని సిగరెట్ల ఖర్చుకు చాలదని. ఇంకా కొంతకాలం ఇలాగే జరిగితే అతని లాంటి మరో ఇద్దర్ని కొనగలను."

లత ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ సుధాకరే అన్నాడు నవ్వుతూ: "ఈ మధ్యకాలంలో పాత జీవితాన్ని చాలా వరకూ మరిచిపోవాలని ప్రయత్నించేను. అయితే నిన్నుమాత్రం మరిచిపోలేకపోయేను. ఓ నెల ముందు కృష్ణ ఓ పేషెంటును తీసుకొచ్చేడు. నేను అక్కడ ఉంటున్నట్టు వాడికి కూడా తెలియదు. నన్నా స్థితిలో చూసి ఎంతో ఆనందించేడు. ఇక్కడి విషయాలన్నీ పూర్తిగా చెప్పేడు. నిన్ను అపార్థం చేసుకున్నందుకు ఎంతో బాధపడ్డాను."

"జీవితం ఒక్కోసారి తమాషాగా మారుతుంటుంది" అంది లత.

"ఎన్నో సంఘటనలు, మరెన్నో సవాళ్ళ మధ్య జీవితాన్ని సాగించడం ఉత్తేజకరంగా ఉంటుం దీ ప్రపంచంలో.



మద్రాసు వెళ్ళిన తరవాతగానీ నాకీ విషయం అర్థం కాలేదు. ఎన్నో దెబ్బలు తింటే గాని, జీవితం సార్థకం కాదు."

"ఏమిటీ, ఉన్నట్టుండి వేదాంతంలో దిగేరు!" అంది నవ్వుతూ లత. సుధాకర్ మాట్లాడలేదు. ఆమె కళ్ళలోకి చూస్తూ ఉండిపోయేడు.

"అన్నయ్యకు నయమౌతుం దంటారా?"

"నా మీద నమ్మకముంటే."

"ఎవరికి?"

"నీకు."

"భలేవారే ..." గలగల పారే సెలయేరులా నవ్వుతూ అంది లత.

ఉన్నట్టుండి సుధాకర్ చేత ఆపరేషన్ చేయించుకుందుకు మళ్ళీ మొండికేసేడు మోహన్.

"వద్దు. లతా ... అతని చేత ఆపరేషన్ చేయించుకోవాలంటే నాకెందుకో భయంగా ఉంది" అన్నాడు చెల్లెలితో.

"ఏవేవో అనవసరంగా ఊహించుకుని నీ మనస్సును పాడుచేసుకుంటున్నావన్నయ్యా. ఎప్పుడో జరిగిపోయినదాన్ని ఇప్పుడు తవ్వుకుని బాధపడ్డం ఏం బాగుంటుంది? గతాన్ని ఆయ నెప్పుడో మరిచిపోయేరు" అంటూ నచ్చచెప్పింది లత.

"పోనీ ... నేను మద్రాసు వెళతానమ్మా ... అక్కడో మరో డాక్టరు చేత చేయించుకుంటాను ఆపరేషన్" అన్నాడు మోహన్ తల్లితో. "ఆ అబ్బాయి అయితే మాకూ ధైర్యంగా ఉంటుందిరా" అని ప్రాధేయపడింది శారదాంబ. డాక్టర్ కృష్ణ కూర్చుని గంటసేపు ఎన్నో విధాల ధైర్యం చెబితేగాని అంగీకరించలేకపోయేడు మోహన్, సుధాకర్ చేత ఆపరేషన్ చేయించుకుందుకు.

మోహన్ భయాన్ని గురించి కృష్ణ చెబితే, నవ్వి ఊరుకున్నాడు సుధాకర్.

ఆ రోజే ఆపరేషన్ చెయ్యవలసిన రోజు.

మద్రాసునుంచి సుధాకర్ అసిస్టెంటు కూడా వచ్చేడు, ఆపరేషన్‌లో సుధాకర్‌కు సహాయం చేసేందుకు. కావలసిన మందులన్నీ స్వయంగా సుధాకరే కొనుక్కొచ్చి పెట్టుకున్నాడు.

ఆపరేషన థియేటర్లోకి సుధాకర్, కృష్ణ, సుధాకర్ అసిస్టెంటు, నర్సులు వెళ్ళేసరికి, థియేటరు వెలుపల ఆత్రతతో, ఆందోళనతో కూర్చున్నారు లత, శారదాంబ క్షణమొక యుగంగా గడుపుతూ.

"ఆపరేషన్ పూర్తయింది. మరేం ఫర్వాలేదు మోహన్‌కు" అని వచ్చిచెప్పేడు సుధాకర్, ఆపరేషన్ పూర్తయిన తరవాత. ఇద్దరి కళ్ళూ కృతజ్ఞతతో మెరిసేయి.

"అతనికి స్పృహ వచ్చిన తరవాత చెప్పండి నాకు ... ఇంజెక్షన్ చేయాలి" అని చెప్పేడు సుధాకర్ తన అసిస్టెంటుతో. అలాగేనని వెళ్ళిపోయేడతను.

మోహన్‌కు స్పృహ వచ్చిన తరవాత అసిస్టెంటు ఆ విషయం చెప్పేడు. తొందరగా లేచి వెళుతూ, "ఇంజెక్షన్ చేసి వస్తాను. నువ్వూ రావా" అన్నాడు కృష్ణతో. శారదాంబ, లత కూడా లేచేరు రోగిని చూడ్డానికి.

ఇంజెక్షన్ వేసేడు సుధాకర్ మోహన్‌కు. అంతే. బాధతో కేకలేస్తూ, మెలికలు తిరిగిపోసాగేడు మోహన్. కృష్ణ అయోమయంగా చూసేడు సుధాకర్ ముఖంలోకి.

మోహన్ శరీరం రంగు మారిపోయింది. తెల్లటి అతని ముఖం నీలిరంగులోకి మారసాగింది. కాళ్ళూ చేతులూ గిజగిజా కొట్టుకుంటూ పెద్దగా కేకలూ, పెడబొబ్బలూ పెట్టసాగేడు. మరో రెండు క్షణాలలో కేకలు పెట్టడం ఆగిపోయింది. ముఖం వికృతంగా మారింది. నాలుక వెలుపలికొచ్చింది. భయంకరంగా.

కంగారుగా మోహన్ చేతిని పట్టుకుని నాడి చూసిన డాక్టర్ కృష్ణ ముఖంలో రంగులు తిరిగేయి. తల వంచుకున్నాడు బాధతో.

సుధాకర్ ముఖం నల్లబడిపోయింది. శిలా ప్రతిమలా నిలుచుండిపోయేడు. లత కళ్ళు జ్యోతుల్లా తయారయ్యేయి, ఎర్రగా. ఆమె చూపుల్లో తనపట్ల కనిపిస్తున్న ఏహ్యభావాన్నీ, అనుమానాన్నీ గమనించి చలించిపోయేడు.

"నీకేం అపకారం చేసేడు, బాబూ, నా కడుపులో చిచ్చు పెట్టేవు? నీ పగ తీర్చుకునే దారి ఇదేనా?!" శారదాంబ మాటలు గుండెల్లోంచి దూసుకుపోతున్నాయి.

"నో ... నో ... నెవర్ ... నే నంత నీచస్థితికి దిగజారలేదు..." అంటూ తల పట్టుకుని పిచ్చివాడిలా కేకలేసేడు సుధాకర్!

అయినా, నమ్మే దెవరు?

నిజం ఏమిటి? ?

ఎవరికి తెలుసు? ? ?

ప్రాణస్నేహితుడు డాక్టర్ కృష్ణకుగానీ, మనసిచ్చిన లతకుగానీ, కన్న కొడుకులా చూసుకుంటున్న శారదాంబకుగానీ చివరకు సుధాకర్‌కు కూడా నిజం తెలియదు.

భగవంతు డుంటే అతనికి తెలుసు.

అతనికీ తెలియకపోయినా —

అందరి ప్రాణాలూ ఒకటేనని, జీవితాలు ఎంతో విలువైనవని, బతుకుల్ని బాగుచేసే మందుల్లో కల్తీ చేయకూడదని, డబ్బుకోసం గడ్డి తినకూడదని తెలుసుకోలేని కల్తీ ప్రబుద్ధులకి తెలుసు — కల్తీ మందుల వల్ల కొన్ని వందల ప్రాణాలు పోతాయని.

విచ్చలవిడిగా సంఘంలోకి చొచ్చుకుని పోతూ, ఘరానాగా చలామణీ అవుతున్న ఈ కల్తీ ప్రబుద్ధులు — చీడ పురుగులు — నరరూప రాక్షసులు మనిషిని మనిషిగా ఎప్పుడు గుర్తిస్తారు?

మానవత్వం విలువ ఎప్పుడు తెలుసుకుంటారు? ? ? ఈ లోపల ఎన్ని ఆర్తనాదాలు వినాలి? ? ? ★